ఏజీపీగా పుట్టా లక్ష్మణరావు

నూజివీడు: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జెస్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పుట్టా లక్ష్మణరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్లపాటు ఏజీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఒకటో అదనపు, రెండో అదనపు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లోని సివిల్ కేసులను ఈయన పర్యవేక్షిస్తారు. లక్ష్మణరావు స్వగ్రామం బాపులపాడు మండలం మడిచర్ల కాగా నూజివీడులో న్యాయవాద వృత్తిని నిర్వహిస్తున్నారు. ఈయన గతంలో ఏజీపీగా పనిచేశారు. ఆయనను పలువురు అభినందించారు.





ఆధార్ నవీకరణకు అవస్థలు

- పనిచేస్తున్నది ఒక్క కేంద్రమే
- ఆధార్ కేంద్రం వద్ద ప్రజల పడిగాపులు

నూజివీడు: ఆధార్ కార్డులోని తప్పులను సరిచేయించుకునేందుకు ప్రజలు ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. అపార్ నంబర్ కోసం ఆధార్ అవసరం కావడంతో తప్పుల సవరణకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పట్టణంలో ఒక్క ఆధార్ సెంటర్ మాత్రమే పని చేస్తుండటంతో ప్రజలకు ఆధార్ కష్టాలు ఎక్కువయ్యాయి. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంక్‌లలో ఆధార్ కేంద్రాలున్నప్పటికీ అన్ని రకాల సేవలు బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మాత్రమే పనిచేస్తుండటంతో అందరూ అక్కడికే వెళ్తున్నారు.

అలంకారప్రాయంగా..

మిగిలిన ఆధార్ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. హెడ్ పోస్టాఫీస్‌లో, యూనియన్ బ్యాంకులోని ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. దీంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నూజివీడు పట్టణం, మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ ఆధార్ కార్డు నవీకరణకు బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి తరలివస్తున్నారు. ఇక్కడ రోజుకి సుమారు 20 మందికి మాత్రమే ఆధార్ నవీకరణ చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఉదయం 8 గంటల నుంచే బ్యాంకు వద్ద ఉన్న ఆధార్ సెంటర్‌కు తరలివచ్చి క్యూ కడుతున్నారు.



ఆధార్ కార్డుల నవీకరణ కోసం పడిగాపులు పడుతున్న ప్రజలు

పనిచేయని సర్వర్..

కొన్ని సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని పనులు ఆపివేసి ఆధార్ సెంటర్‌కు వస్తున్నప్పటికీ ఆలస్యం కావడంతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో ఆధార్ సెంటర్ వద్ద గంటల తరబడి పడిగాపులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమైనప్పటికీ ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ నవీకరణకు మరికొన్ని సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మామిడి సాగుపై రైతులకు అవగాహన

చాట్రాయి: మామిడి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాధారాణి అన్నారు. చీపురుగూడెం, కోటపాడులో మామిడి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూత రావడానికి ఎకరానికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, 2 గ్రాముల బోరాన్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పురుగు నివారణకు 3 మిల్లీలీటర్ల వేప నూనెను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాయితీపై మామిడి కాయలకు తొడిగేందుకు కవర్లు అందిస్తామని, హెక్టార్‌కి 10 వేలు కవర్లు అవసరమవుతాయని చెప్పారు.















టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నూజివీడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 10న ఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బుధవారం మీర్జాపురంలోని హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. మీర్జాపురం హైస్కూల్‌కు చెందిన జి. త్రివేణి ప్రథమస్థానం, బి.హృషికేష్, పట్టణంలోని బాలికల హైస్కూల్‌కు చెందిన కవిత ద్వితీయస్థానం, ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు చెందిన నరసింహ తృతీయస్థానంలో నిలిచారు. వీరికి ఎంపీడీఓ నగదు బహుమతులను, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ డి.స్వర్ణలత, సర్పంచి గోళ్ల పద్మ, డీవైఈఓ ఎం. సేవియా, ఎంఈఓ-2 ఎస్. జమలయ్య, హెచ్ఎం డీవీఎల్ పుష్పలత పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు



ఆగిరిపల్లి: చేపల చెరువుల కోసం ఇష్టానుసారంగా నిషేధిత కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఆగిరిపల్లి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి రోజు చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అంతేకాకుండా ఆ వ్యర్థాలు వ్యానుల్లో తరలించే సమయంలో చుట్టుపక్కల, రోడ్డు వెంబడి భరించలేని దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వంతెన ఇలా.. భద్రత ఎలా?



నూజివీడు: నూజివీడు నుంచి మైలవరం వెళ్లే మార్గంలో ఎన్నెస్పీ కాలువపై ఉన్న వంతెన రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇదే మార్గంలో నిరంతరం భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రెయిలింగ్ దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాహనాలు వేగంగా వెళ్తూ ఏమాత్రం అదుపు తప్పినా కాలువలోకి దూసుకెళతాయి. అధికారులు స్పందించి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

చాట్రాయి: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పోలవరంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ మండలంలో 11,500 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 6,500 ఎకరాల్లో పండిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.శివశంకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అందంగా.. ఆహ్లాదకరంగా!



నూజివీడు: బంతిపూలు ఎంతో అందంగా చూపరులకు కనువిందు చేస్తున్నాయి. మనసుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. మండలంలోని దేవరగుంటలో ఓ రైతు బంతిపూల తోటను సాగు చేస్తున్నాడు. బంతిపూలు చెట్ల నిండా విరబూసి అందంగా.. ఆహ్లాదంగా కనిపిస్తూ దారిన వెళ్లేవారిని కట్టిపడేస్తున్నాయి.